క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప పడిపూజ



కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని దేవిరెడ్డి సాయినాథ్‌రెడ్డి నివాసం వద్ద గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప మాలధారులు, భవానీ, శివ, గోవింద మాలధారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



ఉయ్యూరు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఉయ్యూరులో ప్రశాంతంగా జరిగింది. ఉయ్యూరు డివిజన్ పరిధిలోని విద్యార్థులకు ఉయ్యూరు పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ పద్మారాణి తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో 1155 మంది విద్యార్థులకు గానూ 1091 మంది విద్యార్థులు హాజరయ్యారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



గన్నవరం: క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే క్రీడల్లో రాణించవచ్చని హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు పోలీస్ శాఖకు చెందిన తుపాకుల ఆంజనేయులు సౌజన్యంతో టీషర్టులను ఆదివారం పంపిణీ చేశారు. వెంకయ్య మాట్లాడుతూ తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. క్రీడాకారులకు టీషర్టులను బహూకరించిన దాతలను ఆయన అభినందించారు. వ్యాయామోపాధ్యాయుడు ధనియాల నాగరాజు, సీనియర్ క్రీడాకారుడు రాజేంద్ర పాల్గొన్నారు.

రౌడీషీటర్లు క్రమశిక్షణతో ఉండాలి



పెనమలూరు: రౌడీషీటర్లు క్రమశిక్షణతో ఉంటే వారిపై ఉన్న రౌడీషీట్లు తొలగిస్తామని పెనమలూరు సీఐ రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. సీఐ రామారావు మాట్లాడుతూ రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు తెచ్చుకుంటే షీట్లు తొలగించమని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. ప్రతీ రౌడీషీటర్ కదలికలను గమనిస్తున్నామని సాధారణ ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు, సంఘ విద్రోహులపై గట్టి నిఘా పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోసాలలో వృద్ధులకు చీరల పంపిణీ



పెనమలూరు: గోసాల గ్రామంలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకి యాకమూరుకు చెందిన చొప్పవరపు రమేష్, సునీత దంపతులు చీరలు, నైటీలు పంపిణీ చేశారు. రమేష్ దంపతులు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారికి పిల్లల ఆదరణలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇటువంటి వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం వృద్ధులకి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అల్లాడి త్రినాథ్, ఎల్.రవీంద్ర, చింత నాగేశ్వరమ్మ, ఆత్మూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శరవేగంగా గ్రామాల్లో అభివృద్ధి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



గంగూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: జగనన్న పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గంగూరు గ్రామంలో కాలువ కట్టపై రూ. 61 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. అలాగే మరో రూ. 34 లక్షలతో కాలువ కట్టపై సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన ఉందని తెలిపారు. ప్రధానంగా పేదలు నివసించే ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు, రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని, గ్రామాల్లోకి వచ్చి చూస్తే అభివృద్ధి కనబడుతుందని పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో గత టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, తమ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని వెల్లడించారు. టీడీపీ పాలనలో పేదల సంక్షేమం, అభివృద్ధి అసలు పట్టించుకోలేదని విమర్శించారు. ఎవరి పాలనలో మేలు జరిగిందో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే సూచించారు.

గంగూరులో రూ. 8 కోట్లతో అభివృద్ధి

గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో గంగూరు గ్రామంలో రూ. 8 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశామని ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు కూడా చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి హామీ ఇచ్చారు. గ్రామంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా, ఏఎంసీ డైరెక్టర్ చిట్టూరి సుబ్బారావు, పంచాయతీ వార్డు సభ్యులు అన్సర్‌బాషా, గాబ్రియల్, కొక్కిలిగడ్డ బుజ్జి, జీనత్, పార్టీ నేతలు పి.రాజేష్, యాహియాబాషా, ఎండీ.రహీం, అజీజుల్లాఖాన్, నందేటి రవి, రకీబ్‌ఖాన్, రిజ్వాన్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి దేవస్థానంలో కార్తికమాసం ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. దాదాపు 700మంది పుణ్య దంపతులు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి, చంద్రమౌళీశ్వర స్వామివార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.

దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రవి, వెంకట్రావు

దావాజిగూడెం(గన్నవరం): దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. మండలంలోని దావాజిగూడెంలో స్పందన మానసిక వికాస కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞానయజ్ఞం చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో బహుమతులు పంపిణీ చేశారు. రవి మాట్లాడుతూ వైకల్యం ఉందని బాధపడవద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లితే విజయం తప్పక వరిస్తుందన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులను సేవారత్న పురస్కారాలతో సత్కరించారు. విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోపిశెట్టి వీరాస్వామి, న్యాయవాది అమర్తల సోమేశ్వరరావు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ వెంకట్, వికాస కేంద్రం ప్రిన్సిపాల్ రజిత తదితరులు పాల్గొన్నారు.

తోటివారిని ఆదుకోవడమే అసలైన ఆనందం

హనుమాన్‌జంక్షన్ రూరల్: తోటివారిని తమకు తోచినరీతిలో ఆదుకోవడంతోనే అసలైన ఆనందం, ఆత్మసంతృప్తి కలుగుతుందని మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులో నూతనంగా నిర్మించిన మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ మొత్తం 113 శాఖలతో విద్య, వైద్యానికి ఆర్థిక సాయం, ఇతల సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. కృష్ణా మిల్క్ యూనియన్ చలసాని ఆంజనేయులు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, మానవత ఉమ్మడి గోదావరి జిల్లాల కేంద్ర కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఉమ్మడి కడప జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ రామాంజనేయరెడ్డి, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు పొట్లూరి శేషగిరిరావు, జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తికమాస వనసమారాధనలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో కార్తికమాస వన సమారాధనలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. బొమ్ములూరు–కొయ్యూరు రోడ్డులోని పామాయిల్ తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. మహిళలు, చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి సుధాకర్ పాల్గొన్నారు. వీరవల్లి కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కోడెబోయిన బాబి, కాపు సంఘం నాయకులు బుగ్గ శివ, తోట సుధీర్, జక్కుల రంగారావు, వడ్డి రామకృష్ణ, పులి రంగారావు, బరగడ నాగరాజు పాల్గొన్నారు.

ఉయ్యూరులో....

ఉయ్యూరు: స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యాన కార్తిక వనసమారాధన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని హారికకు రూ. 5 వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. వనసమారాధన కార్యక్రమాన్ని ఎంవీఎస్ మూర్తి, గొట్టుముక్కల సుభాష్‌చంద్రబోస్, తుమ్మలచర్ల శ్రీధర్, పంచుమర్తి ఈశ్వర్, నందం ప్రసాద్ పర్యవేక్షించారు.

అన్నసమారాధన..

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి శ్రీ సాయిబాబా ఆలయం వద్ద కార్తిక మాసం పురస్కరించుకుని అన్నసమారాధన ఆదివారం జరిగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధనలు:

నున్న గ్రామంలో పలుచోట్ల కార్తిక మాసం వన సమారాధనలు జరిగాయి. విజయవాడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. 60వ డివిజన్ శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం, శ్రీ విజయవాడ జ్యూట్ మర్చంట్స్ అసోసియేషన్, కాపు కార్తిక వనసమారాధన, తూర్పుకాపు విజ్ఞాన సంస్థ వనసమారాధన, విజయవాడ పొందర కుల సంక్షేమ సంఘం, ది పూర్ణానందంపేట కిరాణా మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వంటి పలువురు కార్తిక వనసమారాధనలు నిర్వహించారు.

• పంట దక్కితే చాలు





కంకిపాడు: తుపాను హెచ్చరికలు రైతులను కలవర పెడుతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మిల్లులకు తరలించే పనుల్లో రైతులు ఉన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం రోడ్ల మీదకు చేర్చి మిల్లులకు తరలించేందుకు కాటాలు వేస్తున్నారు. ఈ తరుణంలో తుపాను హెచ్చరికలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తుపాను గండం తప్పి పంట చేతికి అందితే చాలని రైతులు అంటున్నారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడరూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగునని తహసీల్దార్ కె.లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీల ద్వారా తెలియజేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగునని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియజేశారు.

7న వాహనాల వేలం

ఉయ్యూరు: అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఉయ్యూరు ఎస్‌ఈబీ సీఐ ఎంఏ ఖదీర్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఈబీ డెప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 7న మధ్యాహ్నం రెండు గంటలకు ఉయ్యూరు ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద రెండు వాహనాలు బజాజ్‌పల్సర్, మారుతీ 800 కారుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9440902451, 9959036522 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రూరల్ ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడరూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం విజయవాడరూరల్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడరూరల్ అధ్యక్షుడుగా కె.బాబురావు, కార్యదర్శిగా ఎస్‌కే ఇమామ్‌సాహెబ్, ఆర్థిక కార్యదర్శిగా ఎల్‌వీ మాధవరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా ఎ.విజయకుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, షీలా, మహిళా కన్వీనర్‌గా పి.హేమలత ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

రైల్వే గూడ్స్ షెడ్స్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైల్వే గూడ్స్ షెడ్స్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక నూజివీడు రైల్వేస్టేషన్‌లో గూడ్స్ సూపరింటెండ్, స్టేషన్ మాస్టర్లకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. నూజివీడు రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్స్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ గోడౌన్స్‌ను అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నూజివీడు రైల్వే స్టేషన్ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపల్లి మోజేష్, షేక్‌బాషా, సభ్యులు పల్నాటి కృష్ణ, మద్దిరామయ్య, ఎర్రబాల రాంబాబు, దొండపాటి మురళి పాల్గొన్నారు.

తెంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో విజయవాడ ప్రశాంత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరంను సర్పంచ్ కొలుసు శిరీషా ఆదివారం ప్రారంభించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ పి.హరిత స్త్రీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేశారు. జీవనశైలి మార్చుకుని పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. హాస్పిటల్ సిబ్బంది సేవల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఉంగుటూరు: తేలప్రోలు–నందమూరు ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం పెదపారుపుడి మండలం వెంట్రప్రగడకు చెందిన కె.స్రవంతి ఉంగుటూరు మండలంలోని జంధ్యాలవారి కండ్రికలో ఓ పూజా కార్యక్రమానికి వెళ్లారు. అక్కడ నుంచి పూజా సామాగ్రి కొనేందుకు ఉంగుటూరు బయలుదేరారు. ఉంగుటూరు–లంకపల్లి బుడమేరు వంతెన మలుపు వద్ద ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పి ఎదురుగా ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన మహిళను స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిచౌంగ్ తుఫాన్ కారణంగా విజయవాడరూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ కె.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజానీకం తుఫాన్ కారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. లేదా 9849903997, 9440747871 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆగమేఘాలపై ధాన్యం తరలింపు



రైతులకు సూచన చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు ఏడీఏ సునీల్, ఏవో శైలజ



ఉంగుటూరులో రైతులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

పెనమలూరు: తుపాన్ ప్రమాదం ముంచుకొస్తుండటంతో అధికారులు ఆగమేఘాలపై ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. మండల పరిధిలో వరి కోతలు గత వారం రోజులుగా ముమ్మరంగా జరిగాయి. హఠాత్తుగా తుపాన్ రావడంతో చేతికొచ్చిన పంట కాపాడుకునే యత్నంలో రైతులున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అందుబాటులో ఉన్న ధాన్యం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో మిల్లులకు రైతులతో కలిసి అధికారులు తరలిస్తున్నారు. పంట వర్షానికి తడవకుండా ఉండటానికి గోదాముల్లో ఉంచే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల ఏవో కనకమేడల శైలజ అన్నారు. ధాన్యం తడవకుండా ఉండటానికి టార్పాన్లు కప్పాలని సూచించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి...

ఉంగుటూరు: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ అమీర్‌బాషా పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. తుపాన్ ప్రభావం పోయేవరకు ఎవరు సెలవు తీసుకోకూడదని ఆదేశించారు. అధికారులు అందరు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

25వేల ఎకరాల్లో వరి సాగు....

ఉంగుటూరు: మండలంలో ఈ ఏడాది 25వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత, కట్టేత, కుప్పల దశలో ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తుఫాన్ దాటికి చేతికందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు కల్లాల్లోకి వెళ్లి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి



పోరంకిలో ఓటరు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివయ్య

పెనమలూరు: ఓటు హక్కు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. మండల పరిధిలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయాలని తెలిపారు. ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మార్పులు, చేర్పులకు కూడా దరఖాస్తులు ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెనమలూరు నియోజకవర్గంలో 306 పోలీంగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి



దావులూరులో తేమశాతంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కోలవెన్ను, తెన్నేరు, దావులూరు గ్రామాల్లో ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో కల్లాలు, రోడ్ల మీద ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. దావులూరు రైస్‌మిల్లును సందర్శించి ధాన్యం కొనుగోళ్లకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ధాన్యం దిగుమతులు ఆలస్యం అవుతున్నాయని, కూలీల సంఖ్య పెంచి దిగుమతి వేగంగా పూర్తయ్యేలా చూడాలని మిల్లు యాజమాన్యానికి చెప్పారు. తేమశాతం పరిశీలించే యంత్రం ఒక్కటే ఉండటంతో పరీక్షల్లో జాప్యం అవుతుందని, రెండు, మూడు యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రవాణా ఆలస్యం కాకుండా ఎన్టీఆర్ జిల్లా నుంచి కూడా రవాణా వాహనాలను సమకూర్చాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారికి ఫోన్‌లో సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని కంకిపాడు, దావులూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఉయ్యూరు ఆర్డీవో, సివిల్ సప్లయిస్ డీఎం రాజు ఆదివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రవాణా ఆలస్యం కాకుండా వాహనాలను పెంచుతున్నామని తెలిపారు. దావులూరు మిల్లును పరిశీలించి, దిగుమతులు ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. పర్యటనలో తహసీల్దార్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న జయప్రకాష్

రామవరప్పాడు: స్వయం ఉపాధికిగానూ ఎనికేపాడులోని వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ రామవరప్పాడులో ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు ఆదివారం అందజేశారు. రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న అల్లింపల్లి వెంకటర్నతం, పట్టెల హేమశ్రీలు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. జయప్రకాష్ మాట్లాడుతూ పలు నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొల్లా ఆనంద్‌కుమార్, క్రాంతికుమార్, గుడివాక బాబు, తుపాకుల స్వామి, నాంచారయ్య, మత్తె రాధాకుమార్, మత్తె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పొందరలకు అండగా జగనన్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నున్న(విజయవాడరూరల్): పొందర కులస్థులకు జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా అండగా వుంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నున్నలో జరిగిన పొందరల వన సమారాధనలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానేత వైఎస్సార్ చొరవతో ఆనాడు పొందరలను బీసీ–ఏ లో చేర్చగా, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పొందరలు కుల ధృవీకరణ పత్రాలు పొందేలా జీఓ విడుదల చేయడం హర్షనీయమన్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రమే పొందరలు కులధృవీకరణ పత్రాలు పొందుతున్నారని గుర్తు చేశారు. అనంతరం పొందర సంఘం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పొందర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రాజాపు హైమావతిఅప్పన్న, 60వ డివిజన్ వైసీపీ కోఆర్డినేటర్ బెవర నారాయణ, ఉమ్మడి కృష్ణాజిల్లా పొందర కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీహెచ్ మురళీ, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణపాత్రో, కార్యదర్శి రామారావు, సలహాదారు నారాయణరావు, సంఘ సభ్యులు పాత్రుని మన్మధరావు, సింహాచలం, పొందర సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.